ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

# ఆధునిక తెలుగుకథ – యువత, పర్యావరణ చైతన్యం

**డా.వై.సుభాషిణి**[1]
సహాయాచార్యులు, తెలుగు అధ్యయన శాఖ,శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం
తిరుపతి
&
**కె.అశ్విని**[2]
అధ్యాపకులు,స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ, శ్రీ పద్మావతి మహిళా
విశ్వవిద్యాలయం, తిరుపతి

Article Received: 18/06/2025Article Accepted: 01/07/2025 Published Online: 02/07/2025

DOI:10.53414/Sahithyatharangini.2025.2313

**ఉపోద్ఘాతం:** పూర్వం ప్రకృతి మితమైన అవసరాలకు అనుగుణంగా ఉండేది. సేంద్రియ పద్ధతులలో వ్యవసాయం సాగేది. కానీ ప్రపంచీకరణ ప్రభావంతో నేడు దానికి విరుద్ధంగా సాగుతోంది. ప్రకృతి వినాశనానికి వ్యాపారధోరణి ఒక ప్రధానకారణమే. ఈ నేపథ్యంలో ఆధునిక తెలుగు కథలు యువత, వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ అంశాలను ప్రధానంగా గ్రహిస్తూ సామాజిక చైతన్యాన్ని తీసుకొస్తున్నాయి. అలా తీసుకొచ్చిన రచయితలు సడ్లపల్లె చిదంబర రెడ్డి, ఆర్. ఉమాదేవి, వేల్పూరి సుజాత, రెడ్డి రామకృష్ణ. వీరు రచించిన కథలద్వారా పర్యావరణ చైతన్యం ఎంతవరకు సఫలీకృతమవుతుందో చూడటమే ఈవ్యాస ఉద్దేశం.

పూర్వం వ్యవసాయం స్వచ్ఛమైన పద్ధతులతో ఋతువులకు అనుగుణంగా, కాలంతోపాటు సజావుగా సాగేది. అంతేకాదు నాటి వ్యవసాయంలో పంటలకు పెట్టే ఎరువులు, కొట్టే మందులు కాలుష్య రహితం. అలాగే పంటలు పండించే కొలది భూమి మరింత సారవంతం అయ్యేది. కలుషితంలేని ఆహారం ఉత్పత్తి అయ్యేది. అది తిన్న మానవుడు ఆరోగ్యంగా అధిక ఆయుః ప్రమాణంతో జీవించేవాడు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ప్రపంచీకరణ ప్రభావంతో అనేక విదేశీకంపెనీలు దేశంలోకి ప్రవేశించాయి. వ్యాపార దృష్టితో, పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని తృణప్రాయంగా భావించి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల్ని మృగ్య పెట్టి, సమస్తాన్ని రసాయనికమయం చేశారు. తిరిగి నాటి సురక్షిత వ్యవసాయ విధానాలను అవలంబింప చేయాల్సిన ప్రభుత్వాలే కంపెనీ దుశ్చర్యలకు చేదోడువాదోడుగా నిలుస్తున్నాయి. కనుక సురక్షిత మార్గాలను కొంతైనా చేపట్టాల్సిన బాధ్యత నేటి చదువుకున్న యువతదే. సమాజంలో జరిగే ఏ సంఘటనను గురించైనా ప్రజలకు మరింత చేరువుగా చేర్చే సులువైన మార్గం రచయితల రచనా వ్యాసంగమే.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

అందువల్ల చాలామంది రచయితలు చదువుకుంటున్న, ఉద్యోగం చేస్తున్న యువతద్వారా రైతుల్లో అధునాతన వ్యవసాయ విధానాలపట్ల అవగాహన కల్పించాలని కథలు అనేకం రాశారు. వాటిలో సడ్లపల్లె చిదంబర రెడ్డి రాసిన "ఒక ప్రయోగం" అనే కథ ఒకటి. పురాతన వ్యవసాయ పద్ధతుల పునరుద్ధరణలో విద్యార్థుల పాత్ర ఏమిటన్న దానిని వివరించే కథ ఇది. పీజీ విద్యార్థులు ఒక గ్రామానికి వెళ్లి, మట్టిని సారవంతం చేయడం, భూగర్భ జలాల సంరక్షణ, గ్రామ ప్రజలలో చైతన్య సృష్టి వంటి అంశాలద్వారా గ్రామ జీవితాన్ని పునఃప్రారంభించారు. విద్యార్థుల సంఘటిత శ్రమద్వారా వ్యవసాయ పునరుజ్జీవనం సాధ్యమవుతుందని ఈకథ హితవు చెబుతోంది.

నేటి ప్రైవేటు ఉద్యోగాలు ఉంటాయో ఊడతాయో తెలియని సందిగ్ధ పరిస్థితుల్లో ఉంటున్నాయి. స్థిరంగా ఉండి పదిమంది కడుపు నింపే పంట పొలాలను ప్రభుత్వాలు ధ్వంసం చేస్తున్నాయి. ఉద్యోగాలు లేక భూములు లేకపోతే భవిష్యత్తు పరిస్థితి ఏమవుతుందనే ఆలోచనతో ఉద్యోగానికి రాజీనామా చేసి వ్యవసాయంలోకి అడుగు పెట్టి రైతులకు అధునాతన పద్ధతులను పరిచయం చేసిన యువకుడి విజయాన్ని తెలిపే కథ ఆర్. ఉమాదేవి రాసిన "పల్లె పిలుస్తోంది".

ఉద్యోగానికి రాజీనామా చేసి వ్యవసాయాన్ని కాపాడిన తీరును 'పల్లె పిలుస్తోంది' కథలో చూస్తే, అమెరికాలో ఉద్యోగం చేస్తున్న మన దేశ పౌరుడు, తన తండ్రిని ఉన్న భూమిని అమ్మేసి అమెరికాకు వచ్చి ఇక్కడ కూరగాయలు పండించు అని ఆహ్వానించే తీరును వివరించే కథ వేల్పూరి సుజాత రాసిన "అపాత్రం".

సొంతూరిలో ఉండి ఆ వ్యవసాయం చేసుకుంటూ అయినోళ్ళతో కలిసి బ్రతుకుదామంటే కరువుకాటకాలు పట్టణాలకు తరుముతున్నాయి. అలాగైనా పట్టణాల్లో ఉద్యోగం చేసుకొని బ్రతుకుదామంటే ఉద్యోగ భద్రతలేక ఇబ్బందులు పడుతున్న వైఖరిని తెల్పేకథ రెడ్డి రామకృష్ణ రాసిన "పిల్లల కోడి".

పాత తోటను కూల్చి, చెరువును పూడ్చి, అపార్ట్మెంట్ నిర్మించిన వ్యక్తి మీద ప్రకృతి ప్రతీకారాన్ని చూపించే కథ వేల్పూరి సుజాత రాసిన "పరిహారం". తల్లి ఆత్మ రూపంలో ప్రకృతి తన ఉసురును వ్యక్తపరిచి, అతని జీవితాన్ని అంతం చేసింది. ఈ కథ పర్యావరణ నాశనంవల్ల మనిషి మీద వచ్చే సహజశిక్షను హృదయవిదారకంగా చూపిస్తుంది. ప్రకృతిమాత తాలూకు మార్మికస్వరాన్ని రచయిత అద్భుతంగా చిత్రించిన కథ.

**వ్యవసాయ పునరుద్ధరణ - యువత:** కర్ణాటక రాష్ట్రంలో పుట్టి ఉత్తరంగా ప్రయాణించిన పెన్నా నది ఆంధ్రాలో కలిసేచోట ఉండే ఒక ఊరు ఒడ్డుపల్లె. ఇక్కడ ముందుకాలంలో వ్యవసాయం సమృద్ధిగా ఉండేది. గత

కొంతకాలంగా ఏరు ఎండిపోయి, భూగర్భం ఆరిపోయి వ్యవసాయంలేక కొందరు అప్పులపాలై, మరికొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ ఊరికి సరైన రవాణాసౌకర్యం లేదు. ఏటిగట్టు బీడు భూమిని ఎకరా కోటిరూపాయలకు మాట్లాడుకున్నారు. అది కూడా అవసరమైనంత లోతు మట్టిని తోడుకొని తిరిగి భూమిని ఇచ్చేలాగ. ఈ విషయం బెంగళూరు విశ్వవిద్యాలయంలో భూగర్భాన్ని గురించి పరిశోధనలు చేసే పీజీ విద్యార్థులకు తెలిసింది. వాళ్లు ఈ గ్రామానికి వచ్చి గ్రామ ప్రజలందరిని ఒకచోట సమావేశపరిచి వారికి వ్యవసాయ మూలాలను, నాటి వ్యవసాయ పద్ధతులను బోధించి, తిరిగి మన నేలకు శోభ చేకూర్చాలని, దీనిని మనందరం ఒక ప్రయోగంగా చేద్దాం అని చెప్పడమే ఒక ప్రయోగం కథ సారాంశం. 'బ్యాక్ టూ నేచర్' సిద్ధాంతాన్ని ఫ్రెంచి తత్త్వవేత్త రూసో 18వ శతాబ్దంలో ప్రతిపాదించాడు. అది ఏనాటికైనా వర్తిస్తుందంటే ఇదే కాబోలు.

బెంగుళూరు విశ్వవిద్యాలయానికి చెందిన పీజీ విద్యార్థులు ఒడ్డుపల్లెలోని భూ ఆక్రమణలను ఆపడానికి "పరిసరాల పరిరక్షణ వాదుల సంఘం" ఏర్పాటు చేశారు. వీరిలో వివేకానంద్ అనే విద్యార్థి పాత్రతో రచయిత చెప్పిన ఆదిమానవ క్రమం ఎంతో అద్భుతంగా ఉంది. శ్రీకాంత్ అనే పాత్రద్వారా కరెంటు రాకముందు వ్యవసాయం ఎలా ఉండేదో, వచ్చిన తర్వాత వ్యవసాయంలో ఎలాంటి వింతపోకడలు చేరుకున్నాయో వివరించిన వైనం నైపుణ్యంగా ఉంది. కరెంటులేని కాలంలో బావులలోని నీటిని కపిల మొదలైన సాధనాలతో చేది వ్యవసాయం చేసేవారు. కరెంటు వచ్చాక బోరుబావులు విరివిగా పెరగడం తద్వారా వ్యవసాయం సాగు పెరగడం, భూగర్భ జలాలు తరగటం, పచ్చిక బయలు లేకపోవడం, దాని మూలంగా పశు సంపద కనుమరుగవటం వలన వ్యవసాయంలో నూతన పద్ధతులు ప్రవేశించాయి. ఇదంతా మానవుడు నాగరికతను ఆహ్వానించటం వలన జరిగిన మార్పే. టెక్నాలజీ పేరిట బోరుబావులు ఎక్కువై భూగర్భజలాలు ఎండిపోతున్నాయి. ఆ భూగర్భంలోని జలాలు ఎన్నో ఏళ్ల నాటివని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరికీ ఉందని మనోహర్ పాత్రద్వారా రచయిత చెప్పించిన మాటలు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి.

"అందుకే సారూ! ఇక వానలు పడవు! పడినా ఏటికి నీరు చేరి మా ఊరిదాకా రాదు. గొడ్డు పడిన పశువును లాగా ఈ భూముల్ని ఉంచుకొని భోంచేసేది ఏముంది? గిరాకి వచ్చింది కాబట్టి అమ్ముకొని ఏదో ఒక దారి వెతుక్కొందామని...."(పుటః 232) ఆ ఊరి రైతు అన్న ఈమాటలు నేడు వ్యవసాయానికున్న ప్రతికూల పరిస్థితులను తేటతెల్లం చేశాయి. ఈమాటలకు సమాధానంగా సంఘంలోని విద్యార్థి "ఉన్నది అమ్మివేయడం, సమస్యలు ఎదురైతే పరుగెత్తి పారిపోవడం పిరికివారి లక్షణం, పరిష్కారాలు ఆలోచించడమే

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

తెలిపైన వారి గుణం"(పుటః 232) అన్నాడు. ఇవి ఎంతో ఉత్తేజభరితంగా, చైతన్య పథానికి బాటలుగా ఉన్నాయి. కరెంటు, గొట్టం బావులు లేనికాలంలో పశువుల ఆధారంగానే వ్యవసాయం చేసేవారు. అలాగే నాటి వ్యవసాయ పద్ధతులనే ఇప్పుడు కూడా యథావిధిగా అవలంభిస్తే గ్రామాలు పాడిపంటలతో, సిరి సంపదలతో విలసిల్లుతాయని విద్యార్థులచేత రైతుల్లో అవగాహన కల్పించారు రచయిత.

**"పల్లె పిలుస్తోంది"** కథలో రాజీవ్ ఒక ప్రైవేట్ ఉద్యోగి. ఇతడి తండ్రి రైతు. తమ ఊరిలో వ్యవసాయ భూములను కొనడానికి సిటి వాళ్ళు వస్తున్నారని, వర్షాలులేక ఉన్న నీళ్ళు సరిపోక, సేద్యం భారంగా ఉందని, మనోళ్ళు అందరూ అధికధరకోసం భూములను అమ్ముతున్నారని, తాను కూడా అంతా కాకపోయినా కొంత అయినా అమ్మి కూతురి పెళ్ళి చేయాలనుకుంటున్నానని, తన నిర్ణయం తెలపమని రాజీవ్ తో చెప్పాడు. ఊరిలో వ్యవసాయం చేయటం తండ్రికి ఎంత కష్టంగా ఉందో రాజీవ్ కి తెలియంది కాదు. తాను చేస్తున్న ఉద్యోగం ఉంటుందో, ఊడుతుందో తెలియనిస్థితిలో ఉంది. ఇక్కడ ఉద్యోగంలేక, ఊరిలో భూమిలేక భవిష్యత్తు పరిస్థితి ఏంటని రాజీవ్ ఆలోచించాడు. రాజీవ్ ఇంటికి వచ్చి వ్యవసాయ భూములు అమ్మడం ఎందుకు నాన్నా... మన వాళ్ళందరిని అమ్మొద్దని చెబుతాను. నేను కూడా ఉద్యోగం మానేసి వ్యవసాయం చేస్తానని చెప్పాడు. తండ్రి నిన్ను చదివించింది సుఖపడతావని, నీడ పట్టున బ్రతికిన వాడివి, మట్టి పిసుకుతానంటావు నీకు పిచ్చా అని కోపపడ్డాడు. రాజీవ్ ఊరందరితో కలిసి మాట్లాడి, వారు భూములు అమ్మకుండా విరమించుకునేలా చేశాడు. నేను ఉద్యోగాన్ని వదిలేయక పోయినా, వాళ్ళే నన్ను ఉద్యోగంలోంచి తీసేసే పరిస్థితి ఉంది. నా మనసులో ఒక ఆలోచన ఉంది. దానిని నేను ఆచరణలో పెడతాను. మీరు భయపడకండి అని చెప్పి, తాను ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ చేసి, ఆఫీసులో ఇచ్చిన 15 లక్షలను తీసుకొని ఊరికి వచ్చాడు.

ఊళ్ళో రైతులందరితో నూతన వ్యవసాయ విధానాలను చర్చించి, అందరం కలిసి రక రకాల పంటలు పండిద్దామని చెప్పి, అందరిలో ఉత్సాహన్ని పెంచాడు. అతడి మాట ప్రకారం అందరూ రకరకాల పంటలు వేశారు. రైతులకు సౌర విద్యుత్, డ్రిప్ ఇరిగేషన్, సబ్సిడీల గురించి చెప్పి వాటిని తీసుకొచ్చి అందరికి పరిచయం చేసి వ్యవసాయ మెలకువలు నేర్పించాడు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించి పండిన పంటలను దళారుల చేతిలోకి పోకుండా నేరుగా మార్కెటింగ్ ఒప్పందాలు నెలకొల్పాడు. అందరికీ లాభాలు వచ్చాయి. రాష్ట్రంలోనే తమ గ్రామాన్ని ఆదర్శంగా నిలిపాడు రాజీవ్. తన తండ్రి కొడుకును చూసి ఎంతో గర్వించాడు. ప్రభుత్వం అతడిని సత్కరించింది. ఉద్యోగ జీవితం ఒత్తిడితో కూడుకున్నది. అయిన వాళ్లతో కలిసి

పొలంలో పని చేస్తుంటే ఎంతో ఆరోగ్యంగా ఉంది. అన్ని వృత్తులకు ప్రత్యామ్యాయాలు కనిపెట్టబడ్డాయి. కానీ వ్యవసాయానికి మాత్రం ప్రత్యామ్నాయాలు లేవు. యువతరం ఆధునిక వ్యవసాయం వైపు దృష్టి సారించాలని కోరుకుంటున్నాను. ఉన్న వనరులను ఉపయోగించడం, ఆధునిక పద్ధతులను అవలంబించడం, అందరం సమిష్టి కృషి చేయటం ఇవే మా గ్రామవిజయానికి కారణాలు అని రాజీవ్ ఇంటర్వ్యూలో చెప్పటంతో హర్షధ్వానాలు అలుముకొన్నాయి.

నాగరికత బాగా అలముకొన్న ఈ రోజుల్లో, దాని ఛాయలు కూడా కనిపించని గ్రామాలు ఇంకా లేకపోలేదు. దానికి కారణం గ్రామాల్లోని ప్రజల్లో అవగాహన లేకపోవడమే. చదువుకున్న వారు ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులు అవలంభించేలా చైతన్య పరచాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగాలు స్థిరంగా ఉంటాయన్న కచ్చితత్వం లేదు. దాంతో ఉద్యోగం లేక, ఉన్న ఊర్లో వ్యవసాయంలేక భవిష్యత్తు పరిస్థితేంటని రాజీవ్ చేసిన ఆలోచన సరైనదే.

వనరులను సక్రమంగా వినియోగించుకోక పోవటం, ప్రభుత్వ రాయితీలు, పథకాల పట్ల రైతులకు సరైన అవగాహన లేకపోవటం వల్లనే, వ్యవసాయం సన్నగిల్లుతోంది. "పల్లె పిలుస్తోంది" కథలో రాజీవ్ తన ఉద్యోగాన్ని వదిలేసి, వ్యవసాయం చేయడానికి సంకల్పించుకోవటం, రైతులను ఉత్సాహ పరచటం, ఆధునాతన పద్ధతులు యంత్రాలు ఎన్నో ఉన్నాయని, వాటిని రైతులకు పరిచయం చేయటం వంటి విషయాలు రచయిత రచనాకౌశలాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

కొండలు, గుట్టల్లో పడ్డ వర్షపునీటిని బావుల్లోకి మళ్ళించి, భూగర్భ జలాలను పెంపొందించాడు రాజీవ్. తాను, ఊరి ప్రజలందరి సమిష్టి కృషి వలన ఇది సాధ్యం అయింది. "బావుల్లో నీళ్ళు చూసి దశాబ్ధం దాటిందిరా మనవడా! ఇక ఎప్పటికీ చూస్తానని కూడా అనుకోలేదు. ఒక నెల రోజుల్లోనే నువ్వు దాన్ని సాధ్యం చేశావ్" అని ఆ ఊరిలోని ఒక తాతగారు రాజీవ్ ని అభినందించిన తీరు యువతలో స్ఫూర్తిని నింపే విధంగా ఉంది.

"ప్రకృతి మనకు అన్నీ ఇస్తుంది తాతా! మనమే సరిగ్గా వినియోగించుకోవడం లేదు. అయినా ఇదంతా నా ఒక్కడి వల్ల ఏమవుతుంది? అందరూ కలిసి ఉంటేనే ఏదైనా సాధించగలం" అని రాజీవ్ అన్న మాటలు ప్రకృతి సర్వ సదుపాయ ప్రధాత అని దానిని మంచి మార్గంలో జాగ్రత్తగా వినియోగించుకోవాలని, సమిష్టి కృషి వలన బహుళ విజయాలు ప్రాప్తిస్తాయనే అంశాలు విశదీకరిస్తున్నాయి. మానవ సంబంధాలు మృగ్యమైపోతున్న ఈ రోజుల్లో సమిష్టి వ్యవసాయ విధానాల వలన ప్రయోజనాలను రచయిత పేర్కొనడం

విశేషంగా ఉంది. 'అభివృద్ధి అంటే ఏమిటి' అనే శీర్షికతో కుమారప్ప రాసిన ఒక వ్యాసంలో "మనం తగినంతగా ప్రకృతి శాసించిన విధానాన్ని అనుసరించి దాన్ని అనుగమించి నడుచుకున్నట్లయితే అది సరైన దిశలో సాగే అభివృద్ధి. కానీ ఎంతవరకు మనం ప్రకృతి గమనానికి వ్యతిరేకంగా నడుస్తామో, అంతవరకు మనం హింసను, వినాశనాన్ని సృష్టిస్తాం...."(J.C.Kumarappa, 'What is Progress?' , Harijan, 13 April 1947) అది అక్షరసత్యమని ఈ కథ నిరూపిస్తుంది. రసాయనిక ఎరువులకు స్వస్తి చెప్పి, సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించి, వ్యవసాయాన్ని వేగవంతం చేశాడు రాజీవ్. పంటను దళారుల చేతులకి పోకుండా, లాభదాయకంగా నేరుగా కంపెనీకే వచ్చి కొనేలా ఏర్పాట్లు చేశాడు. దాంతో పెట్టుబడికి తగిన లాభాలు వచ్చాయి. రైతుల్లో వ్యవసాయం పట్ల ఆసక్తి పెంపొందింది. రాష్ట్రంలో ఈ గ్రామం ఆదర్శగ్రామంగా నిలిచింది. ఉద్యోగంలో ఉన్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలు వ్యవసాయంలో లేవని, యువతరం వ్యవసాయానికి ప్రత్యామ్నాయాలు చేకూర్చాలని ఇంటర్వ్యూలో రాజీవ్ చెప్పిన మాటలు ఎంతో స్ఫూర్తి దాయకంగా ఉన్నాయి.

**నాగరిక పోకడలు :-** "అపాత్రం" కథ నాగరిక పోకడలతో మనిషి చేసే దుశ్చర్యలను వివరించింది. మైనింగ్ కంపెనీ వాళ్ళు ఊరిలోని పంటపొలాలన్నీ సున్నపు గనుల కోసం కొన్నారు. ఒక్క ఆంజనేయులు మాత్రం తన మూడెకరాల భూమిని కంపెనీ వాళ్లకి ఇవ్వలేదు. ఆంజనేయులు తన 25వ యేట వరకు రైతు కూలీగానే బ్రతికాడు . తరువాత కొంత డబ్బు కూడేసి 3 ఎకరాలు కొన్నాడు. భూమి ఉన్న రైతుగానే జీవితం చాలించాలనేది అతడి కోరిక. ఇతడి కొడుకు అమెరికాలో ఉద్యోగం. వాళ్లకి వ్యవసాయం అవసరం లేదు. కంపెనీ వాళ్లకి ఇస్తే భూమినంతా త్రవ్వి నాశనం చేస్తారని ఇవ్వటం అతడికి ఇష్టం లేదు. పంట వేసినా వేయకపోయినా అది పచ్చగా ఉండేదే అతడికి కావాలి. అతడి కొడుకు కంపెనీ వాళ్లకు భూమిని ఇచ్చేసి శ్రమ తగ్గించుకొని ఇకనైనా ప్రశాంతంగా ఉండండి అన్నాడు. ఆంజనేయులుకి ఆ భూమి అంటే ఎంతో ప్రాణం. ఊరి చెరువుగట్టున ఉండే రాములవారి గుడికి తన మూడెకరాల భూమిని రాసిచ్చాడు. ఇలాగైనా తన భూమి పచ్చగా ఉంటుందన్న ఆశతో. కొడుకు అమెరికా రమ్మనడంతో వెళ్లి కొన్ని రోజులు ఉండి తమ ఊరికి వచ్చారు. వీరు వచ్చేలోపే కంపెనీ వాళ్లు తమ మూడెకరాల భూమిని లాక్కొని, రాములవారికి కొన్ని నగలు చేయించి, గుడికి రంగులద్ది చెరువుగట్టు కిందకి మెట్లు కట్టించి శోభను చేకూర్చారు. అంతేకాదు పంటలు పండని పొలంగా ఆంజనేయులు భూమికి సర్టిఫికెట్ తెచ్చి మరీ ఈ పని చేశారు. ఈ విషయం తెలిసిన ఆంజనేయులు నిర్ఘాంతపోవడం కథ.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

ప్రభుత్వాలు విదేశీ కంపెనీలకు దేశంలో అనుమతులు ఇవ్వడమే వ్యవసాయం సన్నగిల్లడానికి, భూములు మాయమవడానికి ప్రధాన కారణం. పంటలు పండినా పండకపోయినా రైతుకి ఆ పొలం మీద ఉండే మమకారం వెలకట్టలేనిది. మైనింగ్ కంపెనీ వాళ్ళు అందరి పొలాలు ఆక్రమించినా ఆంజనేయులు మాత్రం తలొగ్గలేదు. పంటలు పండక పోయిన ఏదో ఒక పిచ్చి మొక్కలతోనైనా పొలం పచ్చగా ఉంటే చాలని తృప్తిపడే అమాయక మనస్తత్వం ఆంజనేయులుది. అందరి భూములు కంపెనీ కొనేయగా మిగిలింది ఆంజనేయులు మూడు ఎకరాలే. ప్రతి ఒక్కరూ ఎక్కువ ధర ఇస్తారు అమ్మేయమన్నారు. అమెరికాలో ఉన్న తన కొడుకు కూడా. "ఎక్కడో అమెరికాలో కూర్చొని హాయిగా బతుకుతున్న వాడికేం తెలుసు తన బాధ. మొదటి ఎకరం కొన్న తర్వాత వారం రోజులు సంతోషంతో నిద్ర పట్టలేదు. అర్ధరాత్రి వెళ్లి కళ్ళారా పొలం చూసుకుంటూ గట్లమీద చుట్ట కాల్చుకుంటూ కూర్చునే వాడు". రైతుకి పొలం పట్ల ఉన్న పంచప్రాణాలు, అలాంటి పొలాన్ని నిరర్థకంగా కొల్లగొట్టి సొమ్ము చేసుకోవాలనుకునే కంపెనీలకు దారాదత్తం చేయడానికి పడుతున్న వేదనను విశదీకరించాయి.

మానవుడు ఆశాజీవి. కళ్ళ ముందున్న వర్తమానాన్ని వదిలేసి కళ్ళకు కనిపించని భవిష్యత్తు కోసం మేడలు కడతాడు. ఆ భవిష్యత్తు కోసం ప్రకృతిలోని వనరులన్నింటినీ స్వార్థం కోసం పూర్తిగా నాశనంచేసి, డబ్బే ప్రథమ ధ్యేయంగా పాకులాడుతున్నాడు. చెరువుగట్టున తాను నాటిన రావిచెట్టు కింద కూర్చున్న ఆంజనేయులు చెట్టు మీదున్న పిట్టలను చూసి.."అలా, పిట్టలమైపుడితే ఎంత బాగుంటది! ఏరోజుకారోజు తిండి కోసం చూసుకోడమే. రేపటి కోసం దాచుకునే పని లేదు" అని అనుకొన్న మాటలు మానవుడి అత్యాశను ప్రకటితం చేస్తున్నాయి.

ఆంజనేయులు తన మూడెకరాల పొలాన్ని దేవాలయానికి రాసిచ్చాక తన కొడుకు కిషోర్ "మంచి పని చేశావు నానా. ఇంక నీకు టెన్షన్ లేదుగా. ఇంకొన్నాళ్ళుండి పోదురు గాని రండి. కావాలంటే నీ కోసం ఇక్కడ భూమి కొద్దిగా లీజుకు తీసుకుంటాను. కూరగాయలు పండిద్దూ గానీ. నా కొలీగ్ చక్రి వాళ్ళ నాన్న రామారావు లేడు ఆయన ఖాళీగా కూర్చోలేక ఇబ్బంది పడుతుంటే వాడు అదే పని చేశాడు.... సమ్మర్ అంతా మేము ఆడనే తెస్తాం నానా. ఫార్మర్స్ మార్కెట్లో కూడా పెడతారు" అన్నాడు. వ్యవసాయానికి పెట్టింది పేరు మన భారతదేశం. అలాంటి దేశంలో వ్యవసాయం సమూలంగా నాశనమవుతోంది. విదేశాలలో మెరుగుపడుతోంది. మన దేశంలోని యువత తమ మేధస్సుని కాదు మన దేశ వ్యవసాయాన్ని కూడా

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

విదేశాలలో అర్పిస్తున్న దౌర్భాగ్యస్థితి నేడు నెలకొంది. అదే చదువుకున్న యువత తమ మేధస్సును ఉపయోగించి మన దేశ వ్యవసాయరంగంలో అధునాతన పద్ధతులు నెలకొల్పితే దేశం సుభిక్షంగా ఉంటుంది.

ఆంజనేయులు తన భూమిని దేవాలయానికి రాసిచ్చినా, కంపెనీ ఆ భూమిని వదలలేదు. వ్యవసాయ యోగ్యంకాని భూమి అని సర్టిఫికేటు తెచ్చి మరీ ఆక్రమించింది. "ఆ మధ్య ఈగుడి కింద ఉన్న భూముల్లో కొన్నిటిని "నిరర్థక ఆస్తుల" కింద వేలమేశారు. వాటిలోనే చేను ఉంది. ఇందులో ఏ పంటా పండదని కాయితాలు తెచ్చారు. ఈమూడెకరాలనూ ఆళ్ళే పాడారు" అని సుబ్బయ్య దుఃఖంతో ఆంజనేయులుకి చెప్పాడు. పంట పండని భూమి అని సర్టిఫికేటు ఇచ్చేది ప్రభుత్వమే. ప్రజల పక్షాన వ్యవహరించాల్సిన ప్రభుత్వమే డబ్బు ఎరలో కంపెనీలకు అనుకూలంగా తలాడిస్తున్న తీరు ఎంతో బాధాకరం. ఇలాంటి నేపథ్యంలో రైతులు నిస్సహాయ స్థితిలో కృంగిపోతున్నారు. ప్రభుత్వాల అండతో కంపెనీలు వ్యవసాయ భూములను అతలాకుతలం చేస్తున్నాయి కనుక “పర్యావరణ సమతుల్యం పాటించడం నేటి మానవుని ప్రథమ కర్తవ్యం. సృష్టిలోని సమస్త జీవరాశులు ప్రకృతి ధర్మానికి లోబడి మసలుకోవడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ పరిస్థితులలో ప్రకృతి పరిరక్షణ, కాలుష్య నివారణపై ప్రతి ఒక్కరు పాటుపడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందంటారు” (ప్రకృతి పర్యావరణ పరిరక్షణ – తూములూరి రాజేంద్రప్రసాద్, పుటః III) వై. ఎస్. రాజశేఖర్ రెడ్డి. అదేగనుక జరిగితే మనదేశ భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుంది.

ఉద్యోగభద్రతలేక, ఉన్న ఊర్లో వ్యవసాయం చేసుకొనే సౌకర్యంలేక పడుతున్న బాధలను తెలిపిన కథ **“పిల్లలకోడి”**. గైరమ్మ, ఎర్రినాయుడు దంపతులకు ఆనందరావు కొడుకు. ఈ ఆనందరావు స్నేహితుడు సూరిబాబు . ఇద్దరికీ హైదరాబాదులో సాఫ్ట్ వేర్ ఉద్యోగం. వీరిలో ఎవరు తమ సొంతూరికి వచ్చినా తమ ఇరుకుటుంబాల బాగోగులు ఒకరి ఇళ్లలో మరొకరు చెప్పుకోవడం అలవాటు. సూరిబాబు సొంతూరికి వెళ్లి, పలకరించడానికి గైరమ్మ దగ్గరికి వెళ్ళాడు. క్షేమ సమాచారాలు అయ్యాక ఆనందరావుకి ఏదైనా చెప్పాలా అత్తా అని అడగగా, “చెప్పడానికి ఏముంది నాయనా..... పంటలు గురించి చెప్పడానికి - భూములు లేవు. మూడేళ్ల కరువుతో ఉన్న భూములు కరిగిపోయాయి. పశువులకు మేతలేక సంతకు తోలినాము” అంటూ తమ బాధను చెప్పి కళ్ళనీళ్ళు పెట్టుకుంది గైరమ్మ. అంతలో బయటనుంచి వచ్చిన ఎర్రనాయుడు నాటి సీ.ఎం రాజశేఖర్ రెడ్డిగారు డ్యాములు కట్టిస్తామని రాష్ట్రానికి నూతన కంపెనీలు వస్తాయని చెప్పిన విషయం పేర్కొన్నారు. డ్యాములు వచ్చినా భూములు లేవని గైరమ్మ నిట్టూర్చింది. నెల నెల వందో, రెండు వందలో

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

తల్లిదండ్రులకు పంపించే ఆనందరావు గత రెండు నెలలుగా డబ్బులు పంపించలేదు. దానికి కారణం ప్రపంచీకరణ ప్రభావంతో నూతన ఆర్థికవిధానాలు మూలంగా తాము పనిచేస్తున్న కంపెనీ మూసేసి వాళ్లు పడుతున్న ఇబ్బందులతో వారిని బాధ పెట్టడం ఇష్టంలేక సూరిబాబు చెప్పలేదు. గైరమ్మ ఇంట్లో ఉన్న పిల్లలకోడి పిల్లలను, పిల్లులు తినగా మిగిలిన ఒక్కటి గద్ద తన్నుకు పోవటం కథ.

వ్యవసాయ భూములు పోయిన రైతు కుటుంబం, తమ కొడుకుల మీద ఆధారపడిన జీవితం, ప్రపంచీకరణ ప్రభావంతో ఉద్యోగాలు కోల్పోయిన యువత – ఈ అంశాల నూతన రూపం. పశువులకు మేతలేక, మడికి నీరు లేకపోవడంవల్ల రైతు జీవితంలో ఎలా సంక్షోభం ఏర్పడుతోందో చూపించిన కథ. చివర్లో పిల్లల కోడి విషాదాంతం – గ్రామీణ సంక్షోభానికి ప్రతీకగా నిలుస్తుంది. ఇది కేవలం మనుషుల కష్టాలే కాదు – పశుపక్ష్యాదుల జీవితాలూ ఎలా కరువుకి బలవుతున్నాయో స్పష్టంగా చెప్పే ఉదాహరణ.

పొలం కొద్దిగా ఉన్నా పుష్కలంగా పంటలు పండితే పిల్లల చదువుకోసం మరే ఇతర అవసరాల కోసం భూములు అమ్ముకోవాల్సిన అవసరం రాదు. వర్షాలు పడక, కనీసం పశువులకు మేతకూడా లేక వాటిని అమ్ముకోవటం మనం ఈ కథలో చూడొచ్చు. మనుషులే కాదు పశువులు కూడా కరువుకి వణుకుతున్నాయి. "ఒక మడికి నీరు కట్టాల్సిన పని లేదు. గేదకు గడ్డి వేయాల్సిన అవసరం లేదు. ఒక కూలికి వెళ్లాలని లేదు. ఉంటే తినడం లేకపోతే అయినింట్ల పడి ఉండడం. అంతే మంచం దిగనక్కర్లేదు. సుఖంగా లేమా! ఏ ఉద్యోగస్తుడికి వస్తుంది ఈ దర్జా!(పుట సంఖ్య. 69) అని గైరమ్మ బాధపడిన దృశ్యం పంట నష్టం వస్తేనే కాదు సాగు లేకపోతే కూడా రైతుకి కష్టమే అని విదితమవుతుంది. ప్రభుత్వాలు డ్యాములు కడతాయంట అని ఎర్రి నాయుడు అనగా అవి వస్తే ఏమి? రాకపోతే ఏమి? భూములే లేవుకదా అంది గైరమ్మ. దానికి బదులుగా "ఓస్ దానికేటిలేయే మన భూమంతా పోతేపోయింది. బోల్డ్ బోల్డ్ కంపెనీలు వస్తున్నాయి. ఎక్కడెక్కడో ఇతర దేశాల నుంచి వత్తాయట."(పుట సంఖ్య. 69) అని ఉత్సాహంగా చెప్పటంలో ప్రపంచీకరణ విదేశీ కంపెనీలతో రైతులు తమ పొలాలను తెగనమ్ముకునేలా చేసి, వారిని కార్మికులుగా మారుస్తున్న తీరు, అది తెలియని అమాయకజనం సంబరం గోచరింపచేశారు రచయిత.

ప్రభుత్వ నూతన ఆర్థిక విధానాలు ప్రపంచీకరణ నేపథ్యంలో విదేశీ దిగుబడుల పోటీకి తట్టుకోలేక కంపెనీ మూతపడి ఉద్యోగం కోల్పోయారు ఆనందరావు సూరిబాబు. సొంతూరిలో బతుకుదామంటే భూములు లేవు. ఉన్నా నీరులేదు. కరువు. పిల్లల కోడి దగ్గర నుండి గద్ద పిల్లను తన్నుకు పోయింది. గైరమ్మ గద్దను

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

తిడుతూ "ఇంట్లో ఉంటే పిల్లులు తినేసే, వీధిలో కొస్తే గెద్దలు తినేసే ఇక పిల్లా పిచ్చుక నెలాగ పెంచడం? (పుట: 71) అన్నమాట ఎంతో అర్థాన్నిస్తుంది.

ఊరిలో బతకాలంటే కరువు, పట్టణాలకు వెళ్లి బతకాలంటే ఉద్యోగంలేక ఇబ్బందులు పడుతున్న జీవితాలను పిల్లలకోడి కథలో చాలా హృద్యంగా చిత్రించాడు రచయిత. గ్రామీణ జీవితాల్లో కరువు కట్టిన వెలితి, పాత వ్యవసాయ విధానాల పతనం, ప్రభుత్వాల అభివృద్ధి హామీల అప్రయోజకత, ప్రపంచీకరణ వలయాల్లో చిక్కిన ఉద్యోగరంగం — అన్నీ ఒకే కుటుంబంలో ఎలా ప్రభావం చూపుతున్నాయన్న దానికి ఈ కథనం ప్రత్యక్ష సాక్ష్యం.

**ప్రకృతి ప్రకోపం:-** “The greatest threat to the Environment is the thought of people that someone else will save it” అన్న డా. తూములూరి రాజేంద్రప్రసాద్ మాటలు అక్షరసత్యాలు. (ప్రకృతిని పరిరక్షించుకుందాం, పుట:8) నేడు సమాజంలో మనం నిత్యమూ చూస్తున్నది ఇదే. ఇది బాధాకరమైన స్థితి. పురాతనతనాన్ని పక్కనబెట్టి ఆధునికతను కోరుకునే మానవ జాతి, స్వార్థంతో ప్రకృతి విలయానికి దారి తీస్తున్న ఆలోచనను కలవరపెట్టే తీరుగా విశ్లేషించిన కథే వేల్పూరి సుజాత రచించిన "పరిహారం". ఈ కథ కథానాయకుడి ద్వారా కార్పొరేట్ సామ్రాజ్యవాదాన్ని, ప్రకృతి నాశనాన్ని, మనిషి తనకుతానే శత్రువు అవుతున్న ఘట్టాన్ని చూపిస్తుంది. కార్పొరేటర్ల భూ దందా ప్రకృతిని నాశనం చేస్తోంది. బంగారం లాంటి పంటలు పండే పొలాలను నిరుపయోగంగా మార్చి పెద్దపెద్ద అపార్ట్మెంట్లు కట్టి వ్యాపారం చేస్తున్నారు. కొన్ని ఎకరాలకు విస్తరించి ఉండే చెట్లను నరికి వాటి స్థానంలో బిల్డింగులు కట్టడం వలన జీవరాశికి ఎంతో నష్టం వాటిల్లుతోంది. ఇలా చేయటం వలన ప్రకృతి స్వయంగా ప్రళయం సృష్టించగలదని తెలిపేకథ "పరిహారం".

ఒక వ్యక్తి తమ పాత ఇంటిని పడగొట్టి దాని స్థానంలో, మరో పెద్ద అపార్ట్ మెంటు కట్టి అద్దెకు ఇచ్చాడు. తాను మరో అపార్ట్ మెంటులో ఒక ఫ్లాట్ తీసుకుని తన భార్యతో కలిసి ఉన్నాడు. వీరు ఉంటున్న అపార్ట్మెంట్ స్థలంలో చింతమాండ్ల తోపు ఉండేది. ఆమాన్ల మీద ఎన్నో రకాల పక్షులు గూళ్లు కట్టుకొని ఆవాసముండేవి. ఈ తోపుకి పక్కన పెద్ద చెరువు ఉండేది. ఈ చెరువులో దొరికే ఏదో ఒకటి పక్షులకు ఆహారం. ఇదంతా ఎంతో అందంగా, అద్భుతంగా ఉండేది. వీరి పాత ఇంటిచుట్టూ సుందరమైన ఉద్యానవనం ఉండేది. ఆ పాత ఇంటిని పడగొట్టి అపార్ట్మెంట్ కట్టడం ఆ వ్యక్తి తల్లికి ఇష్టం లేదు. అయినా కట్టారు. ఆ ఇల్లు చూడకుండానే వాళ్ళ అమ్మకాలం చేసింది. ఒకరోజు అతడు కాఫీ తాగుతూ బయట కూర్చున్నాడు. చనిపోయిన వాళ్ళ అమ్మ అతని దగ్గరకు వచ్చి కూర్చుంది. ఎన్నో చెట్లు, పక్షుల సమాధుల మీద మీరు

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

హాయిగా, విలాసంగా జీవిస్తున్నారు. వాటి ఉసురు మీకు తగులుతుంది అంది. అందరి లెక్కలు తేల్చడానికి వచ్చాను ఆత్మగా అంది. చెరువును పూడ్చారు, చెట్లను కొట్టి పక్షులకు ఆవాసం లేకుండా చేశారు అంటూ అతడి తల్లి ఆత్మ ఏడ్చింది. నిన్ను చంపుతాను అని అతడి తల్లి ఆత్మ పలుగు తీసుకొని వెంబడించింది. అంతలో బంతిలాగా చుట్టూ ముళ్ళు ఉన్న ఆకారం దొర్లుకుంటూ వచ్చింది. ఆత్మ, ఈ బంతి రెండూ ఈ మనుషులు మన పిల్లల్ని చంపేశారు. వీరిని శూన్యంలోకి పంపాలని మాట్లాడుకున్నారు. అతడి గొంతును తల్లి ఆత్మ నులమడం, అతడికి చిన్ననాటి ఇల్లు, చెట్లు, బావి, పిట్టలు గుర్తుకురావడం, అతని ప్రాణం పోవడం కథ.

కథలోని ప్రధాన పాత్ర తన పాత ఇంటిని కూల్చి అక్కడ అపార్ట్మెంట్ కట్టి, అద్దెకు ఇచ్చి సంపాదన మార్గం ఎంచుకున్నాడు. అతడు ఇప్పుడు తన భార్యతో కొత్త అపార్ట్‌మెంట్‌లో జీవిస్తున్నాడు. కానీ, ఆ స్థలం పూర్వంలో ఒక చింతమాండ్లతోపు, పక్కనే పెద్ద చెరువు, ఎన్నో జీవరాశులకు ఆవాసంగా ఉండేది. చెట్లు నరికివేశారు, చెరువు పూడ్చివేశారు, పక్షుల గూళ్లు చెల్లాచెదురయ్యాయి. ఇది ప్రకృతి మృతితో సమానమైంది.

ఒకరోజు అతడి తల్లి ఆత్మ అతని దగ్గరకు వచ్చింది – ఆమె మాటల్లో ప్రకృతి వేదన, విలాపం, ప్రతీకారం కొరకైన గంభీరత నిండి ఉంది. ఆమె ప్రకృతిమాత రూపంలో మాట్లాడింది – నాశనం చేసిన చెట్లు, పక్షులు, చెరువులు తమ బాధను తనకు చెప్పుకుంటున్నాయని చెప్పడం. ఇది ప్రకృతి స్వరూపాన్ని తల్లి రూపంలో ప్రతిబింబించింది. కథలో ఇతివృత్తాన్ని అద్భుతంగా నిర్మించారు. పర్యావరణానికి నష్టం చేకూర్చితే తిరిగి అదే "ప్రకృతి మానవజాతిని అంతం చేయడానికి ఏ మాత్రం వెనకాడదనడానికి నిదర్శనమే ఈ కథాంశం.

తల్లి ఆత్మ వచ్చి అతడితో మాట్లాడిన మాటల్లో మీరు చంపిన చెట్టు, పిట్టలు, జంతువులు, చెరువులు అన్నీ నా దగ్గరికి వచ్చి తమ బాధను చెప్పుకుంటున్నాయి. అవన్నీ నన్ను అమ్మ అనే పిలుస్తున్నాయి అంది. అంటే ఇక్కడ కథలో “తల్లి ఆత్మ” అనేది ప్రకృతి మాతకు ప్రతీక. ఆమె మాటల్లోని ఆవేశం, దుఃఖం, కోపం అన్నీ ప్రకృతి మీద జరిగే దురాక్రమణకు ప్రతిస్పందనగా నిలుస్తాయి. కథ చివర్లో కనిపించే “ముళ్లతో కూడిన బంతిలాంటి ఆకారం” కోవిడ్ వైరస్‌కు ప్రతీకగా నిలుస్తుంది. ఇది మానవుడు చేసిన తప్పులకు ప్రకృతి ఇచ్చిన గట్టి గుణపాఠం.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

మారుతున్న కాలానికి అనుగుణంగా మారాలి. లేకపోతే సమాజంలో నిలబడలేము అన్నది సర్వసాధారణమై పోయింది. "దాంతో అందరూ పచ్చని పంటలు పండే భూములను, పర్యావరణాన్ని ధ్వంసంచేసి మరీ పెద్ద పెద్ద అపార్టమెంటు నిర్మించి, అందులో విలాసాలు సృష్టించి వ్యాపారాలు చేస్తున్నారు. అంతే కానీ వర్యావరణాన్ని గురించి, దాని పరిరక్షణ గురించి లక్ష్యపెట్టడం లేదు. చెట్లను నరికి వాటి స్థానంలో భవంతులు కడుతున్నారు. చెట్లు ఆవాసంగా బ్రతికే ఎన్నో జీవరాశులు మృగ్యమై పోతున్నాయి. చెట్ల కొరత గాలి కాలుష్యానికి ప్రధాన కారణం. ఇదేకాదు నష్టాలు ఎన్నో మరెన్నో. "అవును, చింత చెట్ల ఆత్మలే ! యాభై ఏళ్ల నాటి చెట్లను కూడా నేల కూల్చారు. చెరువంతా పూడ్చి పారేశారు. చెట్ల మీద ఎన్ని వేల పక్షులుండేవో, వాటి గూళ్ళన్నీ చెల్లా చెదురయిపోయాయి. చెరువులో దొరికింది తెచ్చుకు తిని ఇక్కడ హాయిగా ఉండేవి. చెరువూ, చెట్లూ రెండూ పోయాయి. పక్షులు చనిపోయాయి. చెరువులో ఉండే జీవరాశి మొత్తం నాశనమై పోయింది... అంటూ ఏడుస్తున్న తల్లి ఆత్మ మాటల్లో ప్రకృతి విలాపాన్ని దృశ్యమానం చేశారు రచయిత్రి.

చచ్చిన తోట, తోటలోని ప్రాణులు మిమ్మల్ని వదలవు వాటి ఉసురు పోగుకున్నందుకు మీ నాశనాన్ని కోరుకోవడం వాటికి తెలీదు. పాపం ఏడ్చుకుంటూ ఎటో పోయుంటాయి. లేదా చచ్చి ఉంటాయి. కానీ అమ్మ వదలదు నిన్ను" అంటూ ప్రకృతి మానవ జాతిని హెచ్చరిస్తున్నతీరును రచయిత చాకచక్యంగా వ్యాఖ్యానించారు. కాలుష్యం, చెట్ల నరికివేత, చెరువుల పూడ్చివేత, పక్షుల అంతరింపుపై సున్నితంగా కాకుండా తీవ్రమైన విమర్శ చేసిన కథ. "కొబ్బరితోట కొట్టేసి కోకోనట్ గ్రోవ్, తాటితోపు తుడిచి మెజెస్టిక్ ఫామ్" అనే వాక్యాలలో మానవుడు పచ్చని ప్రకృతిని నిర్వీర్యంగా మార్చిన శక్తివంతమైన విమర్శ ఉంది.

ప్రపంచం యాంత్రికంగా మారిపోయింది. సమాజంలో ప్రతి ఒక్కరు స్టేటస్ కోసం ప్రాకులాడుతున్నారే కానీ మన జీవన ప్రకృతి మూలాలను పట్టించుకోవటంలేదు. ఎవరి స్వార్థంకోసం వారు పర్యావరణాన్ని అతలాకుతలం చేస్తున్నారు. "ప్రపంచంలో ప్రతి దేశంలో నీలాంటి వెధవలంతా ఎవరికి తోచినట్లు వాళ్లు సర్వనాశనంలో కార్యకర్తల్లాగా పని చేస్తున్నారా. మీకు ఎల్లలే లేవు. ఎవరి పాపం వాడు అనుభవించాలి. ఎవరి శిక్ష వాడికి పడాలి. ధరణికి గిరి భారమా తల్లికి బిడ్డ భారమా అని పాటలు రాశారు కవులు. నీలాంటి బిడ్డలు తల్లికి భారమే. చంపేయాలి మిమ్మల్ని" అన్న మాటల్లో ప్రకృతి ప్రకోపం స్పష్టంగా అవగతమవుతుంది.

చెట్లను, పక్షులను అంతమొందించినందుకు తల్లి ఆత్మ పలుగు పట్టుకొని కొడుకును తరుముకొంటుంటే అతడు రాయి తట్టుకొని బోర్లాపడ్డాడు. అప్పుడు అతడికి గుండ్రంగా, పెద్ద బంతిలాగా,

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

ఉమ్మెత్త 'కాయకున్నట్టు దాని చుట్టూ ముళ్ళు ముళ్ళుగా కొమ్ములు ఉన్న రూపం కనిపించింది. ఆ రూపం తల్లి ఆత్మతో ఏం చేశాడు? కాలుష్యం పారించాడా? కాలువలు పూడ్చాడా ?" అని అడిగింది. దానికి సమాధానంగా ఆత్మ నా పిల్లల్ని, నా చెట్లు, నా తోట నా చెరువు అన్నింటినీ చంపేశాడు. నేనూరుకోను అని చెప్పింది. "నేనూ అదే పనిలో ఉన్నా. తీరగా వచ్చింది. కావాలంటే గాలిని నీళ్లను ఆకాశాన్ని కూడా అమ్మేసే జాతి. వీల్లైనంతమందిని శూన్యంలోకి పంపాలి. నువ్వు వాడి పని చూడు. నేను ఊర్లో వాళ్ళ సంగతి చూస్తా. మనకు రోగాలు వచ్చాయి. ఆ రోగాల క్రిములు వీళ్లే. వీళ్ళందర్నీ చంపితేగాని మనం కోలుకోలేము. ఇదొక వైరస్. వైరస్ అన్న తర్వాత నాశనం చేయాల్సిందే. చంపెయ్, చంపెయ్. పిల్లల్ని చంపడం తప్పు కాదు. వీళ్ళు నా పిల్లలే. నేను చంపాల్సిందే. ఎన్నాళ్ళని ఊరుకోను? చంపేస్తే గాని తీరదు ఈ పాపం" అన్న మాటల్లో బంతిలాంటి రూపం కరోనా వైరస్ అని కరోనా సమయంలో మానవుడు అనుభవించిన దుర్భర పరిస్థితులకి కారణం మానవ తప్పిదాలే అని ప్రకృతిని వినాశనం చేస్తే అది ప్రళయంగా సమస్తాన్ని ముంచెత్తుతుందని రచయిత్రి ఈ కథలో సూక్ష్మీకరించారు.

రచయిత్రి చక్కటి కథన శైలితో, కాలం మారుతున్నా మనిషి ప్రకృతిని విస్మరించరాదని హెచ్చరిస్తారు. ప్రకృతిమీద దాడులు చేస్తే, అదే ప్రకృతి మానవుణ్ణి మింగేసేలా ప్రతీకారం తీర్చుకుంటుందని చెప్పే కథ ఇది. “మీరు చంపిన చెట్లు, పక్షులు నన్ను 'అమ్మ' అని పిలుస్తున్నాయి” అనే తల్లి ఆత్మ మాటల్లో ప్రకృతిపట్ల మానవుడు కలిగించాల్సిన బాధ్యతను గుర్తుచేస్తుంది.

వేల్పూరి సుజాత గారి "పరిహారం" కథ మనిషి స్వార్థంవల్ల ప్రకృతిలో కలిగే మార్పులు, వాటి భయంకర పరిణామాల్ని ఉద్వేగంగా, ప్రతీకాత్మకంగా చిత్రించింది. ఇది ఒక హెచ్చరిక. ప్రకృతిని ప్రేమించాలి, పరిరక్షించాలి. లేకపోతే మానవుడు “పరిహారం” చెల్లించక తప్పదు.

**ముగింపు:** “We don’t own this nature from our Ancestors. But we need to preserve this nature for our future generations” (ప్రకృతిని పరిరక్షించుకుందాం! - డా. తూములూరి రాజేంద్రప్రసాద్ పుట: 8,) ఈ కథలన్నింటిలోనూ రచయితలు వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, యువత పాత్ర, ప్రపంచీకరణ ప్రభావం వంటి అంశాలను హృద్యంగా మేళవించి, సమకాలీన సమాజానికి మార్గదర్శకత్వం చూపుతున్నారు. యువత సామూహిక చైతన్యంతో వ్యవసాయాన్ని తిరిగి మేలు పథంలోకి తీసుకురాగలదన్న ఆశను కథలన్నీ వ్యక్తం చేస్తున్నాయి.